# భర్తా రూపసీ!

బాబిగాడు మెట్లమీద నుంచి దొర్లి పడడంతో–ఉన్న ఓప్పికాస్తా ఆవిరైపోయింది పార్వతికి. "ఛ, ఛ ఏం బ్రతుకు" అని సణుక్కుంది–బాబిగాణ్ణి జబ్బపట్టుకు లాక్కొచ్చి ముందు గదిలో కూలవేస్తూ, "జల్సారాయుడిలా దేశం తిరుగుతాడు. అతనికేం...ఇలాంటి దొక్క గంట, గంటంటే గంటసేపు భరించమనాలి తెలుస్తుంది!" అనుకుంది ఏదో టూరు వెళ్ళిన కృష్ణమూర్తిని గురించి. బాబిగాడి అరుపులు, వాటిమీద నుంచి నానిగాడి గోల పిచ్చెత్తిస్తున్నాయి పార్వతిని. "అమ్మా బాబికేమైంది? ఎందుకలా ఏడుస్తున్నాడు!" అడుగుతున్నాడు నానిగాడు. గోడకి జేరబడి ముందిరిపళ్ళ మధ్య సందులోనుంచి దారం ఇటూఁయిటూ లాగుతున్నాడు!

నోటిమాట లేకుండానే "ఖబడ్దార్!" అన్నట్లుచెయ్యి చూపింది పార్వతి. ("ఒరేయ్, నీకెన్ని సార్లు చెప్పాను. అలా పళ్ళ సందుని దారం వేసి లాగవద్దని; ఆ పళ్ళు కాస్తా ఊడిపోతే నీకు మళ్ళీ పళ్లు మొలవ్వు తెలుసా!" అని ఆ చెయ్యి తిప్పటకు వ్యాఖ్య) "బాబీ నాకేమంత దెబ్బ తగల్లేదు. ఊరుకో" అంటూ చిన్నవాణ్ణి కసిరింది. "నాకు తగిలింది. కావలిస్తేచూడు. రక్తంవచ్చిందా!" అంటూ రెండుచేతులూ

తలమీాద పెట్టు కోటం మొకలెట్టాడు. (అలా రెండు చేతులూ ఒకేసారి తలమీాద పెట్టద్దని ఎన్నో సార్లు చెప్పింది పార్వతి!) "మహా! రక్తం వస్తే ఏం? నాకు మేకు గుచ్చు కున్నప్పుడు రాలేదా ఏంటి?" గొప్పగా అన్నాడు నానిగాడు.

"వడిశావులే-వెధవగొప్పలూ నువ్వూను. వర్షం తగ్గి నట్లుంది. పోయి ఆడుకో" అని హుకుం జారీ చేసింది. పెద్ద కొడుక్కి. "లేదమ్మా బాగా కురుస్తోంది కావలిస్తే చూడు" అక్కడితో ఆగాడు నానిగాడు, వాడిదంతా తండ్రి పోలిక. "అమ్మా, అదేదో ఉపద్రవంలాగా అక్కడ అదేంటి? యిక ఈ వర్షం అలాగే కురిసేసి మనూరు ముంచేస్తుందా?" వెధవ ప్రశ్నలు-నానిగాడికి అన్నీ సంశయాలే. ప్రశ్నలువేసి వేధిస్తాడు. గొప్పధీరుడిలా మాట్లాడుతాడు. కాని బాబిగాడి ధోరణి చూస్తే ఉత్తరకుమారిడిలా తయారయేలా ఉన్నాడు. ఏమన్నా భయమే. నానిగాడి మాట విన్నాడో లేదో మళ్ళీ ఆరునొక్కరాగం ప్రారంభించాడు. "మనూరు మునిగిపోవద్దు" అంటూ.

దగ్గిరలో ఉన్న కుర్చీలో కూలబడి కళ్ళు మూసుకుంది పార్వతి. పెళ్ళిచేసుకోవాలనుకోవడం, ఇలాంటిపిల్లలని కనడం, అసలు తానెలా ఇలాంటి వల్లో చిక్కుకుందో, ప్రతి ఆడ దానిమీాద ప్రయోగించే భయంకరమైన జోక్ కాబోలిది! కోర్కెల గుర్రాల దౌడులో ఇలాంటి గడుగ్గాయిల్లాంటి సంతానం గాసి, తెమలని పని గాని కన్పించదా. వర్షం రానీ, వరదలు రానీ ఉతకవలసిన బట్టలకి సెలవుండదు.

"అమ్మా, ఇలా వర్షంగా వుంటే మా స్కూల్లో

ముక్కుటీచరు చక్కగా ఆటలాడిస్తారు." ఎంతో ఆత్రంగా అమ్మ చెవి దగ్గర చేరి అన్నాడు నానిగాడు.

"ఆ దానికేంభాగ్యం? ఇంకొక్క పదిహేను రోజులు ఓపిక పట్టు, మీా ముక్కుటీచరుఆడిస్తుంది!" కసిరింది పార్వతి. కిటికిలోంచి ఎక్కడికో చూస్తుంది పార్వతి. దూరంలో బుట్ట గొడుగులా వానకోటులో దాక్కుని నడిచివస్తున్న పోస్టు మేన్‌ని ముందు నానిగాడు చూశాడు. "అమ్మా పోస్టు!" అంటూ వాడు తలుపు తెరవడానికి బయలు దేరాడు. నిజంగానే పోస్టుమేన్ ఒక కవరిచ్చి పోయాడు. చిన్న ఎత్తు యుద్ధం తరువాత దాన్ని నానిగాడు చేతిలోంచి లాక్కో గల్గింది పార్వతి. ఎంత ఉత్సాహంతో విప్పిందో అంతగా నీరుకారిపోయి తిరిగి కుర్చీలో కూలబడిపోయింది. "అమ్మ ఎవరు? పిన్నా? అత్తయ్యా," ఒకటే గోలచేస్తున్నాడు నానిగాడు.

"కొత్త ఆంటీ వస్తూందిరా- రెండువారాలు మనూళ్లో ఉంటుందిట." నిరుత్సాహంగా అంది పార్వతి.

"బలే బలే, అయితే రోజూ ఆ ఆంటీతో బీచ్‌కి వెళ్ళవచ్చు. నీళ్ళల్లో దిగనిస్తుందా!" ఆత్రంగా అడిగాడు నానిగాడు. "దిగనివ్వడమేం కర్మ! దింపినా దింపుతుంది. పోయి ఏ బొమ్మల పుస్తకమో చూసుకో" అని వాణ్ని పంపేసి ఇల్లు సర్దాలన్న సదుద్దేశ్యంతో లేచింది పార్వతి. ఉత్తరాన్ని పట్టి చూస్తే కాబోయే వన్నెల విసనకర్ర అని తోచింది. "ఎం. ఏం ప్యాసైంది. అందంగా, నాజూకుగా మెరుపులాగా ఉంటుంది. పిల్లలు మన స్త్రత్వంపైై పి. హెచ్. డి. చేస్తుంది. కలిమిడిగా ఉంటుంది. అందుకే నీ దగ్గరకి పంపు

తున్నాను పారూ!" అంటూ ఎంతో ముద్దుగా రాశారు సరస్వతమ్మగారు. సరస్వతమ్మగారైనా సహాయం కావాలంటే కాదనే ధైర్యంలేదు పార్వతికి. ఆవిడ కృష్ణమూర్తి తరఫు బంధువు కావడమే కాకుండా స్నేహపాత్రురాలు. అయినా సాయంత్రం బండిలో వస్తూన్న కన్యారత్నాన్ని రావద్దన డానికి కూడా టైములేదు. అందుకే ఇంకో దారెలాగాలేదు కదా అని ఇల్లు శుభ్రంగా చేసి ఉంచుదాం అనుకుంది.

...సరస్వతమ్మగారి వర్ణనకంటే కూడా అందంగా నాజూకుగాఉన్న ఆఅమ్మాయి దీపాలు పెట్టే వేళప్పుడు టాక్సీ దిగింది. దువ్వీ దువ్వనట్టున్న తలకట్టు దగ్గరయింది. కాలికి ఉందా లేదా అన్న సుందరమైన జోళ్ళదాకా నాగరికత మూర్తీభవించి ఉందా అమ్మాయి. పార్వతి గుండె గొంతు లోకి వచ్చింది. మైగాడ్! ఈమెని రెండు వారాలపాటు యీ పిల్లల మధ్య ఎలా భరించడం? అని స్వగతం పలుక్కుని మెట్లు దిగి క్రిందికి నడిచింది-ఆహ్వానించడానికి.

"నమస్కారమండీ ఉత్తరం అంది ఉంటుందో లేదో అని మహా ఇదైపోయాను. ఐయామ్ సారీ—మీకు శ్రమ కల్గిస్తున్నాను—అంటూనే టాక్సీకి డబ్బులిచ్చి పెట్టె ఒక చేత్తో పట్టుకు నిలబడింది. "అడిగీ అడగ్గానే రాసేశారు సరస్వతమ్మగారు. నే నీ రెండు వారాలూ రాకుంటే పి. హెచ్. డి కి చాలా శ్రమపడాలి. నా కెక్కువ పని ఉండదులెండి, ఇంట్లో సహాయం చేయిస్తారుగా?" అంటూ ఇంట్లోకి దారి తీసింది.

పిల్లల్ని చూసింది. "హల్లో బాబులూ!" అని పల్కరించింది. హాల్లోకి వస్తూనే గోడనున్న కృష్ణమూర్తి ఫొటో

మీాద పడ్డాయి ఆమ్మాయి కళ్ళు "అరె ఎంత బ్యూటిఫుల్ మేన్! ఎవరు? మీా వారా?" అంది.

తానేదో తప్పుచేసినట్లు "అవునండీ" అంది పార్వతి "మీాకీ పక్కగది ఖాళీ చేశాం. స్నానం చేస్తారా!" అంది.

"అక్కర్లేదండీ అన్నీ ముగించుకునే వచ్చాను... మీా ఆయన ఊళ్లోలేరా!" అంది ఆమ్మాయి.

"లేరు రెండు వారాలు రారు" అంది పార్వతి. మన స్సులోనే కృష్ణమూర్తి లేనందుకు అమ్మయ్యా! అనుకుంది.

ఏదో పిచ్చాపాటి మాట్లాడుతూంటేనే రాత్రి పది గంటలైంది. ఈ కొత్త మనిషి రాకతో బాబిగాడూ, నాని గాడూ పిల్లికూనలై పోయారు. ఆవిడనిచూస్తే వాళ్ళకంతా అయోమయంగా ఉంది.

తెల్లవారి రెండు గంటలు గడిచే సరికి ఒక సంగతి అర్థంఅయింది పార్వతికి. ఇరవై నాలుగ్గంటలూ ఇంట్లో ఉండ డం సహించలేదు. కన్యారత్నం (పేరడిగేటంత ధైర్యం చిక్క బట్టుకోలేక పోయింది పార్వతి) ఎంతసేపూ గోళ్లు సరిచేసు కోవడమే. ఉన్నరంగు మార్చి ఇంకో రంగు వేసుకోవడమో చేస్తూ పిల్లలని మటుక్కు చేయి దూరంలో ఉంచింది. "పిల్లలు దూరంనుంచి స్టడీ చేయడానికి బాగుంటారుకదూ!" అంది పైపెచ్చు "అవును తన స్వంత పిల్లలు కాకుంటే!" అనేసి నాలిక్కరుచుకుంది పార్వతి.

కొంచెం వర్షం తెరిపి ఇచ్చింది ఎండ తెర పోకుండా. ముఖ్యంగా ఆరవేయవలసిన బట్టలేనా తడుపుదాం అని పార్వతి బాత్ రూమ్‌లో ప్రవేశించింది. పట తోపాటే పార్వతి

కోపంకూడా పెరుగుతూంది. ఛ ఆ ఉత్తరం ముక్క రెండు రోజులముందు వచ్చివుంటే! ఏదో వంక పెట్టేసి ఈ గండం దాటించుకునేది.

బట్టలు మంచినీళ్ళలో జాడించి పిడిచి వేరే బేసిన్‌లో వడేస్తున్న పార్వతికి చిన్న భూకంపం వచ్చినట్టు అనిపించి ఇవతలికి వచ్చింది. గుమ్మంలో టాక్సీ దాని తలుపులు పట్టుకు వేళ్ళాడుతూ భూమి దద్దరిల్లేలా అరుస్తున్నారు కుర్రాళ్ళు. ఆ హడావిడికి గదిలోంచి అమ్మాయి బయటికి తలపెట్టి చూసింది. టాక్సీ పంపేసి అమాంతం ఇద్దరు కొడుకుల్నీ రెండు చేతులా ఎత్తుకుని మెట్లెక్కి వస్తున్నాడు కృష్ణమూర్తి. సగం తడసిన చీర రేగి చిందరవందరగా ఉన్న జుట్టు, కళ్ళనిండా, అలసటతో నిలబడింది పార్వతి తన కళ్ళని నమ్మలేక! పిల్లలని దింపి "మైబ్యూటిఫుల్" అంటూ పార్వతిని ఆక్కున చేర్చుకొన్నాడు కృష్ణమూర్తి. "చూశావా — నే నేం చేశానో ఒక కొలీగ్ నా స్థానే పనిచేస్తానన్నాడు. అంతే అమాంతం రెక్కలు కట్టుకు ఈ దీనుడు నీముందు వాలాడు" అంటూ పార్వతి ముంగురు సరిచేస్తున్న కృష్ణమూర్తి కంట యాధాలాపంగా - అమ్మాయి పడింది. "మైగాడ్!" అంటూ పార్వతిని ఒదిలి "ఏం పార్వతీ. మనకి చుట్టాలొచ్చారా?" అన్నాడు చిలిపిగా, (పార్వతి స్నేహితురాళ్ళందరూ గడుగ్గాయిల్లాంటి కాలేజీ అమ్మాయిలూ, ఉద్యోగినులూ. వాళ్ళలో చాలా మందితో పరిచయం ఉంది కృష్ణమూర్తికి)

"అవును, మీ సరస్వతిపిన్ని గెస్టుని పంపారు. రా, పరిచయం చేస్తాను." అని "మీట్ మై హస్‌బెండ్" అంటూ

పరిచయం చేసింది పార్వతి. అమ్మాయి ముఖం ఒక్కసారి వెల్తుతో నిండింది.

"వెరీగ్లాడ్ నాకు చాలా సంతోషంగా ఉంది. రేప ట్నుంచి నా పనిమీద తిరగాలి. కంపెనీ లేదే అని బెంగ పెట్టుకున్నాను!" అంది అమ్మాయి.

"నా పేరు కృష్ణమూర్తి" అన్నాడు చిలిపిగా నవ్వుతూ కృష్ణమూర్తి. "చాలా చక్కని పేరు. నా పేరు భారతి" అంది అమ్మాయి. ఆ క్షణం నుంచీ ఇద్దరూ పార్వతి ఉనికి మరిచి పోయి కబుర్లు చెప్పుకుంటున్నారు. తమకు తెలియకుండనే ఇద్దరు నడిచివెళ్ళి హాల్లో కూర్చుని అమితోత్సాహంగా ఓ క్షణం గడిచినా గడిచిన క్షణం రాబట్ట లేమన్నట్టు, చుట్టు ప్రక్కల ఇంకెవరు లేనట్టు కబుర్లు చెప్పుకుంటున్నారు.

పార్వతి నిట్టూర్చి మళ్ళీ బాత్‌రూమ్‌లోకి వెళ్ళి పోయింది. నానిగాడు బాబిగాడు సోఫాలచుట్టూ పరుగు పెడుతూ వేటగాడూ - పులీ ఆట ఆడుతున్నారు! ఆగోల ఏక్కడా వినబడడం లేదు కృష్ణమూర్తికి!

బాత్‌రూములోంచి వంటింటిలోకి వెళ్ళింది పార్వతి. మనసంతా ద్వేషంతో అసూయతో రగులుతూంది. ఏం భర్త ? అని వందోసారి అనుకుంటూ చేయి విదిలించేసరికి పొయ్యిమీద నూనె బాణలి కాస్తా వచ్చి కాలుమీద కూర్చుంది. ఒక్కకేక పెట్టి – దుఃఖంతో బాధతో గట్టిగా ఏడవడం మొదలుపెట్టింది పార్వతి. కృష్ణమూర్తి పరుగెత్తుకు వచ్చాడు "ఏమైంది?" అంటూనే జరిగింది గ్రహించాడు. "పిచ్చి పారూ, అంత హడావిడి దేనికి" అని కోప్పడుతూ

ప్రవేశ సంఖ్య 27995

నెమ్మదిగా నడిపించి పడగ్గది చేర్చాడు. కాలిన బొబ్బలికి జంపెన్ వైట్ పులిమి సముదాయించాడు. అయినా పార్వతి ఏడుపు తగ్గలేదు. వెక్కి వెక్కి పడుతూన్న పార్వతిని కౌగిట జేర్చుకొని ఎంతో సేపు ఊరడించాడు. "నేనూ భారతీ కలిసి ఎలాగో గడిపేస్తాంలే – నువ్వు నిశ్చింతగా పడుకో" అంటూ మెత్తని తలగడపై పార్వతి తల సుతారంగా జార్చాడు కృష్ణ మూర్తి. "నువ్విలాంటి దానివని తెలుసు నాకు. ఈ కాలం వాళ్ళకీ నీకూ పోలికలే లేవు. నేనూ భారతీ కలిసి తినడాని కింత సృష్టిస్తాం. నువ్వు నిద్రపో" అని నుదురుమీద పడ్డ జుట్టు సవరించి వంగి ముద్దు పెట్టుకున్నాడు కృష్ణమూర్తి. పార్వతి కళ్ళు మూసుకుంది.

ఆ క్షణంలో కాలం స్థంభించి పోయింది.

భారతి కావలసినవి అందిస్తూంటే కృష్ణమూర్తి వంట లాంటిది చేశాడు. గుమ్మంలో నించుని పిల్లలు వింతచూడ్డం మొదలు పెట్టారు.

సాయంత్రం ఏడుగంటల ప్రాంతాలలో నానిగాడు గది లోకి వచ్చేదాకా తెలివి రాలేదు పార్వతికి. "అమ్మా నేను పెద్దవాణ్ణి కదా! నన్నూ అప్పుడే పడుకో మనేశారు." అంటూ తల్లి మంచం ఎక్కాడు.

"నాన్నగారేరీ?" అడిగింది.

"నువ్వు నిద్దర పోతున్నావుగా! అందుకనీ నాన్నారు ఆ భూతాన్ని బీచ్ కి తీసుకెళ్ళారు" అన్నాడు నానిగాడు. వాడి కేదుపుతో నవ్వు కూడా వస్తూంది.

"నీతో చెప్పారా?"

"ఊఁ" ఓకేయ్ సాన్నీ, నేనూ బాంబూ బీచ్‌కి వెళ్ళి వస్తాం అమ్మ లేస్తే చెప్తావు కదూ; అన్నారే" అన్నాడు. తల్లి సమాధానంకోసం ఎదురు చూడకుండానే "వాళ్ళెక్కడికో వెళ్ళాలని నన్ను పడుకోమన్నారు. నేను పడుకోను" అని తన నిశ్చయాన్ని తెలియ చేశాడు నానిగాడు. ఏం చెయ్యాలో తోచని పార్వతి నానిగాడి తల నిమురుతూ కూర్చుండి పోయింది. "నే లేకుంటే వీరు అనాథలే అయిపోతారు." అనుకుంది "కృష్ణమూర్తి నన్ను ఒదిలేస్తే!" అన్న భయంకరమైన ఆలోచన ఓక్షణం పట్టి పీడించింది. కృష్ణమూర్తి తన కూడా లేని భవిష్యత్తు భయంకరమైన పీడకలగా విస్తరిస్తూ ఊపిరి తిరగనీయడంలేదు. ఊహల ఉచ్చులను విడలించుకొని లేచింది పార్వతి పాదాలు పూర్తిగా నేలమీద ఆనడంలేదు. నానిగాడి చేయిపట్టుకుని హాల్లోకి తీసుకు వెళ్ళింది. "తమకు తాము సహాయం చేసుకోని వారికి దేవుడుకూడా సహాయం చెయ్యడు" అన్న నీతిని బోధించే కథ - రంగు బొమ్మలతో పెద్ద అచ్చులో ఉన్నది. చదివి వినిపిస్తూంది నానిగాడికి. వాడు ఆత్రంగా వింటూ మధ్య మధ్య ప్రశ్నలు వేస్తున్నాడు. కునికిపాట్లు పడుతున్నాడు.

పార్వతి తన స్వంత ఆలోచనలతో సతమతమవుతూనే వాడికి సమాధానం చెపుతూంది.

వీధిలో కారు ఆగిన చప్పుడైంది. ఆలోచనలను కట్టి పెట్టి అటుతలకి చూసింది. గాలి దుమారంలాగా మెట్లెక్కి విసురుగా వస్తూంది భారతి. అలాగే తిన్నగా తనకి కేటాయించిన గదిలోకి వెళ్ళి పెట్టె సర్దుతూంది. ఏం జరిగిందో ఊహిం

చిన పార్వతి ముఖం సిగ్గుతో జేవురించింది వెనకనే వచ్చాడు కృష్ణమూర్తి. ఓ చేత్తో గెడ్డంమీద రాసుకుంటూ ఎక్కడో చూస్తున్నాడు. ఆ పోకడ అర్థం పార్వతికి బాగా తెలుసు. ఏం చేయాలన్న ఆలోచన పాలుపోకపోతే ఆ సందిగ్ధపు పోజులు వస్తాయి కృష్ణమూర్తికి.

ఏం పలకరించకుండా వెళ్ళి కుర్చీలో కూలబడ్డాడు. అదే క్షణంలో భారతి గది తలుపు తెరచి పెట్టి చేతకట్టుకుని ఇవతలికి వచ్చింది, ఆమెచూపులే ఉరుముల్లాగా ఉన్నాయి! పార్వతి నోట మాటలేకుండా చూస్తూఉండిపోయింది. భారతి వీధిలోకి వెళ్ళింది. దారేపోయే రిక్షావాణ్ణి కేకవేసి ఎక్కి వెళ్ళిపోయింది. పార్వతికి అప్పటికిగాని తెలివి రాలేదు.

ఎదురుగా కుర్చీలో కూర్చుని ఉన్న కృష్ణమూర్తి దగ్గరికి వెళ్ళింది "ఏమైంది?" అడిగింది. కంఠస్వరం గంభీరంగా వున్నా లోపల ఒణుకుతూంది గుండెలు దడదడలాడాయి. ఇంతటితో ఈ కుటుంబపు గుట్టు రచ్చకెక్కినట్టే అనుకుంది.

కృష్ణమూర్తి తలెత్తి చూశాడు. ఆ చూపుల్లో కొంచెం సిగ్గు, సంకోచం చూచాయగా కనబడ్డాయి పార్వతికి. పార్వతి కళ్ళల్లోకి చూడలేకపోయాడు. "నీకు కోపం వస్తుందేమోపారూ" అంటూ చెప్పీ చెప్పనట్టుఊరుకున్నాడు.

"కోపం వస్తుందా?" హేళనగా నవ్వుతూ ఎదురు ప్రశ్న వేసింది.

అప్పుడు అక్కడే కుర్చీలో అడ్డదిడ్డంగా పడుకుని నిద్రపోతున్న నానిగాడు జ్ఞాపకం వచ్చాడు పార్వతికి. వాణ్ని ఎత్తుకు తీసికెళ్ళి పక్కలో పడుకోపెట్టి వచ్చింది. వస్తూ తిన్నగా కృష్ణమూర్తి కుర్చీ దగ్గిరకి వెళ్ళి నిలుచుంది.

"కానీ ఇంకా ఆలోచన ఎందుకు? అనదలచినవన్నీ ప్రారంభించు. నేను సదుద్దేశంతోనే..."

కృష్ణమూర్తి మాట పూర్తి కానివ్వలేదు పార్వతి. "అవునవును నీ పెద్దవాడూ సదుద్దేశ్యాలే!" అంది.

"ఆ అమ్మాయి ఇలా అపార్థం చేసికుంటుందని నాకేం తెల్సు?" అన్నాడు అమాయకంగా ముఖంపెట్టి.

"ఆమెని ప్రేమించ పోయావుకదూ?..." నిప్పులు కక్కుతూ అడిగింది పార్వతి. "నీ అందంచూసి అలా మూర్ఛపోయి నీ కౌగిట ఒరుగుతుంది అనుకున్నావు కదూ? నేనెలాగా కాళ్ళు కాలి పడుకున్నాను. హాయిగా నాలుగు రోజులు జల్సా చేద్దాం అనుకున్నావు కదూ?" అంటూనే ముఖం చేతుల్లో దాచుకుని ఏడ్వడం ప్రారంభించింది పార్వతి. "ఇంతే ఈ మగవాళ్ళెప్పుడూ ఇంతే." అంటూ స్వగతం పల్లు కుంటూ వెక్కి వెక్కి ఏడ్చింది పార్వతి.

ఎదురు చూడని ఈ పరిణామానికి అదిరిపోయాడు కృష్ణమూర్తి. ఆమెఅన్న మాటలకి క్షణం నివ్వెరపడిపోయాడు మరుక్షణం అతని కంతా అర్థం అయింది. గట్టిగా నవ్వుతూ పార్వతిని గట్టిగా కౌగలించుకున్నాను. అయినా పార్వతి చలించలేదు. "నువ్వట్టి పాతకాలం మనిషివి పార్వతీ, ఇంత ఆత్రంగా ఇంటికెందుకు వచ్చాను-ఈ కొత్త అమ్మాయితో కాలక్షేపం చేయడానికా! పిచ్చీ, అసలీ అమ్మాయిని చూసేకే నాకో ఆలోచన తట్టింది. ఎలాగా పది రోజులుంటుంది కదా, అందులోనూ పిల్లల శాస్త్రం తెలిసినది-నానిగాడినీ, బాబినీ చూసుకుంటుందేమో-నిన్ను తీసుకు అలా వెళ్ళి రావచ్చు

అనుకున్నాను అయితే ప్లానంతా తల్లక్రిందులైంది. సునిద్దరం ఏకాంతంగా విశ్రాంతిగా ఉండి ఎన్నాళ్ళయిందో నీకు తెలియదా పారూ" అన్నాడు కృష్ణమూర్తి.

పార్వతి తలెత్తి చూసింది. నాకీ సంగతెందుకు చెప్పలేదు" చిన్న పిల్లలాగా అడిగింది.

"నీకు తెలియకుండా గమ్మత్తుచేద్దాం అనుకున్నాను! కథ అడ్డంతిరిగింది!" నిస్పృహగా అన్నాడు కృష్ణమూర్తి. నే పూర్తిగా చెప్పకుండానే అమ్మాయిగారు బిగుసుకుపోయారు! ఇంగ్లీషులో ఏవేమిటో అంది లే! ... నా సరదా చెట్టెక్కింది. నీకు సహాయం కూడా లేకుండా చేశాను."

"సహాయమా' అమ్మాయి! మైగాడ్ నీకేం తెలుసు. నే నేం నరకం అనుభవించానో! కృష్ణా" ప్రేమతో నిండిన ఆ పిలుపు విని అలా పార్వతి కేసి చూస్తూ ఉండిపోయాడు కృష్ణమూర్తి. పార్వతి బుజాలమీద నుంచి కొండంత బరువు దిగిపోయినట్లుయింది. "కృష్ణా!" అంటూ కృష్ణమూర్తిని కౌగలించుకుంది కృతజ్ఞతతో ఆమె హృదయం నిండిపోయింది... తన పిల్లలు అనాధలు కారు! ఎప్పటికీ కారు. తన భర్త రూపసేగాని శత్రువు కాడు. తన వాడే